# పోటా పోటీ ప్రచారం

అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో రాజకీయ పార్టీలు తమ ప్రచార వేగం పెంచాయి.సనత్‌నగర్, సికింద్రాబాద్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో వివిధ పార్టీల తరపున పోటీచేస్తున్న అభ్యర్థులు శనివారం ఉత్సాహంగా ప్రచారం చేశారు. తమకు ఓటు వేసి అవకాశం కల్పించాలని ఓటర్లను కోరారు.

## అడ్డగుట్టలో పద్మారావుగౌడ్


ప్రచారంలో భాగంగా టీ అందిస్తూ..

అడ్డగుట్ట: పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ అన్నారు. శుక్రవారం అడ్డగుట్టలోని రియో పాయింట్, బుద్ధానగర్, లోహియా నగర్, బోయ బస్తీ, మొండి బండ నగర్, మరాఠా బస్తీ తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతరెడ్డి, బీఆర్ఎస్ నేతలు కిషోర్, త్రినేత్ర గౌడ్, లింగాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## తలసానికి మద్దతుగా..


బేగంపేటలో ప్రచార నిర్వహిస్తున్న కార్పొరేటర్ టి.మహేశ్వరి శ్రీహరి

సనత్‌నగర్: సనత్‌నగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు మద్దతుగా బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరి శ్రీహరి ప్రచారం నిర్వహించారు. పాటిగడ్డ, ఎన్‌బీటీనగర్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీహరి, శ్రీనివాస్‌గౌడ్, శేఖర్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## లాస్య నందితను గెలిపిద్దాం



రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తామని ఆ పార్టీ నియోజకవర్గ యువజన విభాగం కన్వీనర్ బి. సాయికిరణ్ పేర్కొన్నారు. శుక్రవారం మూడవ వార్డు మడ్‌ఫోర్డ్ అంబేద్కర్ హట్స్, కట్టకింది బస్తీలో అభ్యర్థి లాస్య నందితకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సాంబ అశోక్, వెంకట్, మొగిలి, రోషయ్య. దుర్గేష్, శ్రీను, అనిల్, పరశురాం పాల్గొన్నారు.

## బీజేపీ జెండా ఎగురవేస్తాం


ప్రచారం చేస్తున్న బీజేపీ అభ్యర్థి మేకల సారంగపాణి

బౌద్ధనగర్: సికింద్రాబాద్ నియోజకవర్గంలో బిజేపీ గెలుపు ఖాయమని ఆ పార్టీ అభ్యర్థి మేకల సారంగపాణి ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ డివిజన్ అధ్యక్షుడు హనుమంతు ముదిరాజ్ ఆధ్వర్యంలో డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో అభ్యర్థి సారంగపాణి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాయకులు మేకల కీర్తి, సత్యనారాయణ, కొమరయ్య, రాజ్‌కుమా పాల్గొన్నారు.

## 78 చోట్ల గెలుపు బీఆర్ఎస్‌దే..



సనత్‌నగర్: నియోజకవర్గ ప్రజల అవసరాలను గుర్తించి అందుకనుగుణంగా సౌకర్యాలను కల్పించామని సనత్ నగర్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. రాంగోపాల్‌పేట డివిజన్ నల్లగుట్ట, చుట్టాలబస్తీ ప్రాంతాల్లో శుక్రవారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రచార కార్యక్రమంలో పలువురి యువకులు మంత్రి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో 78 స్థానాల్లో గెలిచి మళ్ళీ అధికారంలోకి రాబోతున్నామన్నారు. మాజీ కార్పొరేటర్ అరుణగౌడ్, శివయ్య, రాజేష్, సతీష్ పాల్గొన్నారు.

## 'రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబపాలన'


విలేకరులతో మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి మేకల సారంగపాణి

సికింద్రాబాద్: ఈసారి లష్కర్‌లో ఘన విజయం సాధిస్తామని సికింద్రాబాద్ బీజేపీ అభ్యర్థి మేకల సారంగపాణి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం సీతాఫల్‌మండి డివిజన్‌లో ఆయన నాయకులు, కార్యకర్తలు అనుచరులతో భారీ ర్యాలీ నిర్వహించారు. సీతాఫల్‌మండి డివిజన్ శివాజీ విగ్రహం నుంచి చిలకలగూడ అమర్ టాకీస్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబ సభ్యులు రాజ్యమేలుతోందన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ కుటుంబ సభ్యుల పెత్తనం నడుతస్తోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కే.నాగేశ్వర్‌రెడ్డి, కనకట్ల హరి, అంబాల రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

## బేగంపేట్‌లో కాంగ్రెస్ నేతల సమావేశం



సనత్‌నగర్ : కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బండి రమేష్ బేగంపేట్ డివిజన్ అల్లం తోటబావిలో ముఖ్య కార్యకార్తల సమావేశం నిర్వహించారు. అనంతరం నగర కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గౌరపల్లి రమేష్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాచరణపై సమావేశం నిర్వహించారు. నాయకులు శ్రీరంగం సత్యం, కే కృష్ణారెడ్డి ,అర్జున్, రాజయ్య, ఎం సాంబయ్య, దేవేందర్ నరేష్, సురేష్ బాబు,బాలరాజ్ పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌లోకి షాబాద్ సత్యనారాయణ



సనత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత షాబాద్ సత్యనారాయణ శుక్రవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఆయనతో పాటు బీజేపీ నాయకురాలు నవీనాశుక్లా కూడా మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ శేషకుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ఇండిపెండెంట్ అభ్యర్థి నామినేషన్



సికింద్రాబాద్: నామినేషన్ల పర్వం ప్రారంభమైన తొలిరోజే సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థి సికింద్రాబాద్ నామినేషన్ దాఖలు చేశారు. శుక్రవారం అడ్డగుట్ట డివిజన్ ఈస్ట్ మారేడుపల్లికి చెందిన కొండారపు రాహుల్‌గుప్త తన నామినేషన్ పత్రాలు అందించినట్టు సికింద్రాబాద్ రిటర్నింగ్ అధికారి ఎస్.ఎల్లారెడ్డి తెలిపారు.

# గెలుపెవరిదో..

- సనత్‌నగర్ ఎన్నికలు ఆసక్తికరం
- గెలుపుపై ఎవరికి వారు ధీమా

సనత్‌నగర్: నియోజకవర్గ బరిలో నిలిచే ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరనేది తేలిపోయింది. ప్రధానంగా సనత్‌నగర్‌లో త్రిముఖ పోటీ నెలకొంది. అధికార బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు ఇప్పటికే ప్రచారంలోకి దిగేశారు. ఎవరికి వారు ఆయా పార్టీలు నిర్దేశించిన మేనిఫెస్టోలతో పాటు గెలిపిస్తే నియోజకవర్గంలో తాము చేపట్టబోయే కార్యక్రమాల వివరాలతో సొంత ఎజెండాను రూపొందించుకుని ఓటర్ల వద్దకు వెళ్తున్నారు. గెలుపు తీరాన్ని చేరుకోవాలనే కసితో తమకున్న రాజకీయ అనుభవంతో సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. తమ అమ్ములపొదిలోని ప్రచార అస్త్రాలను తీసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. అయితే మూడు ప్రధాన పార్టీల్లోనూ బలాలతో పాటు బలహీనతలు ఉన్నాయనేది రాజకీయ విశ్లేషకుల మాట. ఆయా అభ్యర్థుల బలబలాలు, బలహీనతలు ఏమిటీ అనే అంశాన్ని ఒక్కసారి పరిశీలిస్తే...

### తలసాని శ్రీనివాస్ యాదవ్ (బీఆర్ఎస్)



**బలాలు**

- నియోజకవర్గంలో వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి..
- గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేసిన దీర్ఘకాలిక సమస్యలు అయిన బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్‌బస్తీ ముస్లిం గ్రేవ్‌యార్డు నిర్మాణం, సనత్‌నగర్ మంచినీటి రిజర్వాయర్, మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, మల్టీ పర్పస్ ఫంక్షన్ హాళ్ళ నిర్మాణం, జీరా ప్రాంతంలో లీజు ల్యాండ్‌లో ఇళ్లు నిర్మించుకుని ఉంటున్న వారి ఇళ్ళ స్థలాలను ఫ్రీ హోల్డ్ చేస్తూ జీఓ జారీ, రాష్ట్రంలో ఎక్కడాలేనంతగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళ నిర్మాణం వంటి అభివృద్ధి పనులు పూర్తి చేయడం.
- పార్టీ క్యాడర్ బలంగా ఉండడం.

**బలహీనతలు**

- కొంతమంది డివిజన్ స్థాయి నాయకులు కింది స్థాయిలో వసూళ్ళ పర్వానికి దిగుతున్నారనే ఆరోపణలు కొంత తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు ప్రతికూల పరిస్థితులను తెచ్చిపెడుతున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి.
- వేల సంఖ్యలో దళితులు ఉండగా కేవలం కొంతమందికి మాత్రమే దళితబంధు కింద లబ్ధి చేకూర్చడంతో మిగతా వారిలో అసంతృప్తి నెలకొంది. ఇదే అంశాన్ని ప్రతిపక్షాలు అస్త్రం చేసుకున్నాయి.
- గడిచిన జీహెచ్ఎంసీ ఎన్నికల్లో రెండు ప్రధానమైన డివిజన్లు అమీర్‌పేట, రాంగోపాల్‌పేటలతో పాటు మోండా డివిజన్ బీజేపీ ఖాతాలోకి వెళ్ళడం. ఆయా డివిజన్లలో బీజేపీ కార్పొరేటర్లు ఉత్సాహంగా పనిచేస్తూ ఆ పార్టీ క్యాడర్‌ను విస్తరించుకుంటూ వెళ్ళడం.

### మర్రి శశిధర్‌రెడ్డి (బీజేపీ)



**బలాలు**

- సనత్‌నగర్ నుంచి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన మర్రి శశిధర్‌రెడ్డిపై ఎలాంటి అవినీతి ఆరోపణలు లేకపోవడం.
- అధికార పార్టీ నేతలు చేసే ప్రజావ్యతిరేక విధానాలపై గళం విప్పడం.
- న్యాయపరమైన అంశాలపై పూర్తి స్థాయి పరిజ్ఞానం కలిగి ఆ మేరకు నిర్ణయాలు తీసుకోవడం.

**బలహీనతలు**

- బీజేపీలోనే రెండు మూడు గ్రూపులు ఉండడంతో వారు ఏమేర సహకరిస్తారనేది అనుమానమే.
- తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఉన్న కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, ముఖ్యనాయకులు ఎవరూ కూడా ఇప్పుడు ఆయన వెంట లేకపోవడం.
- అంతేకాకుండా ప్రస్తుతం బీజేపీలో ఉన్న కార్పొరేటర్లు కూడా ఆయనకు దూరంగానే ఉంటూ వస్తున్నారు.

### కోట నీలిమ (కాంగ్రెస్)



**బలాలు**

- రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన ఆమె రాజకీయ విశ్లేషకురాలిగా ఖ్యాతి గడించడం ద్వారా ఎన్నికల మేనేజ్‌మెంట్‌పై అవగాహన కలిగి ఉండడం.
- ఏఐసీసీ స్థాయిలో పట్టు ఉండడంతో ఢిల్లీ పెద్దలు సైతం ఆమెకు మద్దతుగా ప్రచారం చేసే అవకాశం.
- పార్టీ బలంతో పాటు కాంగ్రెస్ మేనిఫెస్టోనే ఆమె బలంగా చెప్పవచ్చు.

**బలహీనతలు**

- పారాషూట్ నేతగా సనత్‌నగర్ నియోజకవర్గం నుంచి తొలిసారిగా పోటీ చేస్తుండడంతో నియోజకవర్గంపై పూర్తిస్థాయి అవగాహన లేదనే విమర్శలు ఉన్నాయి. ఆమె వెంట నడిచే నేతల బలాబలాలు ఏమిటని ఒక అంచనా వేయలేకపోవడం.
- కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్ ఆశించి భంగపడ్డ కొంతమంది నేతలు ఆమెకు దూరంగా ఉండడం.

## పీహెచ్‌డీ హాస్టల్స్ భోజనశాల మూసివేత

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పీహెచ్‌డీ హాస్టల్స్ భోజనశాలను మూసివేశారు. దసరా సందర్భంగా సెలవులు ప్రకటించిన అధికారులు తిరిగి ప్రారంభించేందుకు నిరాకరిస్తున్నారు. భోజన బకాయిలు చెల్లిస్తేనే పునఃప్రారంభిస్తామని చెప్పడంతో విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్కాలర్‌షిప్‌లో మెస్ బకాయిలు కట్ చేసుకోవాలని విద్యార్థులు చూచించినా అధికారులు ఒప్పుకోలేదు భోజనవసతి లేనందున పరిశోధన విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం అందజేయాలి

అడ్డగుట్ట: అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సీఎం అల్పాహారం పథకాన్ని అమలు చేయాలని డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులిి కల్పన కోరారు. ఈ మేరకు శుక్రవారం సచివాలయంలో విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పులి కల్పన మాట్లాడుతూ.. సికింద్రాబాద్ మండలంలో ఒక్క పాఠశాలలో కూడా అల్పాహారం అందించడం లేదన్నారు. అడ్డగుట్ట, ముషీరాబాద్ పాఠశాలల్లో మాత్రమే అందజేస్తున్నారని తెలిపారు. ముషీరాబాద్‌లో అందిస్తున్న అల్పాహారం నాణ్యత లేని కారణంగా విద్యార్థులు తినలేకపోతున్నారన్నారు.

## అక్రమ, కల్తీ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు


విలేకరులతో మాట్లాడుతున్న సికింద్రాబాద్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి..

సనత్‌నగర్: అక్రమ, కల్తీ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని సికింద్రాబాద్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. బేగంపేట భగవంతాపూర్‌లోని ఎక్సైజ్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం మద్యం షాపుల ద్వారా విక్రయించే మద్యం మినహాయించి మరేదైనా సరే అక్రమ మద్యం కిందికే వస్తుందన్నారు. తెలంగాణ మద్యాన్ని గుర్తించడానికి ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లలో 'వెరిట్' (వీఈఆర్ఐటీ) అనే యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఆ యాప్ సహాయంతో మద్యం బాటిల్‌పై ఉన్న హోలోగ్రామ్‌ను స్కాన్ చేస్తే సదరు బాటిల్ వివరాలు వస్తాయన్నారు. మద్యం పేరు, బాటిల్ సైజు, ఎంఆర్‌పీ, తయారు చేసిన కంపెనీ పేరు, డిపో పేరు, ఏ షాపు నుంచి విక్రయించారో వివరాలు తెలుస్తాయన్నారు. స్కాన్ చేసినప్పుడు ఆ వివరాలు రానిపక్షంలో ఆ మద్యం అక్రమ మద్యంగానే పరిగణించి 87126 59644 నెంబర్‌కు గానీ, 18004252523 టోల్‌ఫ్రీ నెంబర్‌కు గానీ ఫిర్యాదు చేయాలన్నారు.

**అక్టోబర్‌లో 30 కేసులు నమోదు..**

సాధారణ ఎన్నికల సందర్భంగా జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి పవన్‌కుమార్ ఆదేశాల మేరకు అక్టోబర్‌లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించి 30 కేసులను నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కేసుల్లో 22 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 172 లీటర్ల సుంకం చెల్లించని మద్యం, 18 లీటర్ల డిఫెన్స్ మద్యం, 34 లీటర్ల తెలంగాణ మద్యం, 96 లీటర్ల బీరు, 600 కిలోల నల్ల బెల్లం, 55 కిలోల పటిక, 86.6 కిలోల ఎండు గంజాయి, 575 గ్రాముల గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఒక వ్యక్తి ఆరు మద్యం బాటిళ్ల కంటే ఎక్కువగా కలిగి ఉంటే స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎక్కడైనా మద్యం నిల్వలు ఉన్నాయనే సమాచారం ఉంటే సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

## మొదటిరోజు నామినేషన్లు నిల్

సనత్‌నగర్: తెలంగాణ ఎన్నికల నోటిఫికేషన్ శుక్రవారం విడుదల కావడంతో నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. సనత్‌నగర్ నియోజకవర్గం నుంచి తొలి రోజు ఎవరూ నామినేషన్‌ను దాఖలు చేయలేదు. అయితే నామినేషన్లు వేసేందుకు ఆర్వో కార్యాలయం నుంచి గురువారం మూడు, శుక్రవారం ఒక నామినేషన్ పత్రాలను తీసుకువెళ్లారు. ఈ నెల 10వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తామని ఆర్వో కిషన్‌రావు తెలిపారు.

## ఎస్‌బీఐ రూ.10లక్షల బీమా చెక్కు అందచేత

రాంగోపాల్‌పేట్: రోడ్డు ప్రమాదంలో మరణించిన ఓ వ్యక్తి కుటుంబ సభ్యులకు ప్రమాద బీమాకు చెందిన రూ.10లక్షల చెక్కును ఎస్‌బీఐ అధికారులు అందించారు. శుక్రవారం సికింద్రాబాద్ ప్యాట్నీ సెంటర్‌లోని ఎస్‌బీఐలో బ్యాంకు సికింద్రాబాద్ ఏవో డీజీఎం బాలానంద్ ఈ చెక్కును బోలక్‌పూర్‌లో నివాసం ఉంటూ మృతి చెందిన శివకుమార్ భార్యకు అందించారు. రీజనల్ మేనేజర్ శైలజా, డివిజనల్ మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో రూపాయల్లో.) టమాటా 21, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 28, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 35, పచ్చకాకర 26, పందిరి బీర 23, క్యాబేజీ 13, క్యారెట్ 29, దొండ 13, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 55, గోకరకాయ 25, కీర 25, దోసకాయ 13, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 48, ఆలుగడ్డ 21, చామగడ్డ 37, మొరంగడ్డ 18, కందగడ్డ 50, సొరకాయ 11, పొట్లకాయ 13, అరటికాయ 9, ముల్లంగి 4–6.

## ఉచిత కంప్యూటర్ శిక్షణ

ముషీరాబాద్: సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్(ఎస్ఆర్‌డీ) ఆధ్వర్యంలో కంప్యూటర్ కోర్సుల్లో వంద రోజుల శిక్షణ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు ఎస్ఆర్‌డి డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బేసిక్స్ ఆఫ్ అకౌంటింగ్, కమ్యూనికేటివ్ ఇంగ్లీష్, ఇంటర్వ్యూ స్కిల్స్, డిజిటల్ లిట్రసీ స్కిల్స్, ఎంఎస్ ఆఫీస్, ఇంటర్నెట్ కాన్సెప్ట్స్, కంప్యూటర్ టైపింగ్ తదితర శిక్షణను ప్రతి రోజు ఉ.10 గం నుంచి మ. 2 గం వరకు, మ. 2.30 గం నుంచి 6.30 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు రాంనగర్‌లోని మేయూర్ బాలయ్య భవన్‌లోని ఎస్ఆర్‌డీ స్కిల్ సెంటర్‌లో సంప్రదించాలని కోరారు.

## ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు

కాచిగూడ: బాలానందం వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఈనెల 5న ఆదివారం బాలబాలికలకు ఫ్యాన్సీడ్రెస్, నీతి పద్యాలు, భక్తి గీతాల పోటీలు నిర్వహించనున్నట్లు బాలానందం కార్యాలయ కార్యదర్శి లావణ్య తెలిపారు. ఆదివారం ఉదయం 11 చిన్నారులకు ఫ్యాన్సీ డ్రెస్, నీతి పద్యాలు పోటీలు, మధ్యాహ్నం 1:30 గంటలకు సబ్ జూనియర్స్, జూనియర్స్ విభాగాల్లో భక్తి గీతాలు, నీతి పద్యాలు పోటీలు ఉంటాయని తెలిపారు. నారాయణగూడ లోని బాలానందంలో జరిగే ఈ పోటీల్లో బాలబాలికలు పాల్గొని తమ ప్రతిభ పాటవాలను చాటుకోవాలని కోరారు. వివరాలకు ఫోన్: 040-27561443.

## నాణ్యతతో కూడిన విద్య అందించినప్పుడే సుస్థిర అభివృద్ధి


సదస్సుకు హాజరైన వక్తలు..

సనత్‌నగర్: అక్షరాస్యత రేటు పెరగడం సంతోషకరమే అయినా నాణ్యతతో కూడిన విద్య అందించలేకపోవడం విచారకరమని పలువురు వక్తలు పేర్కొన్నారు. బేగంపేటలోని సెస్ ఆడిటోరియంలో జరుగుతున్న ఇండియన్ అసోసియేషన్ సోషల్ సైన్స్ ఇనిస్టిట్యూషన్స్ (ఐఏఎస్ఎస్ఐ) వార్షిక సదస్సులో భాగంగా రెండో రోజు పలు కీలక అంశాలపై సుదీర్ఘ చర్చ జరిగింది. సుస్థిర, పట్టణీకరణ అభివృద్ధి, మహిళా సాధికారతలపై పలువురు పరిశోధనా పత్రాలు సమర్పించారు. ఆచార్య డి.నరసింహారెడ్డి అధ్యక్షతన ప్రముఖ ఆర్థికవేత్త పద్మభూషణ్ తర్లోక్‌సింగ్ స్మారక ఉపన్యాసం కొనసాగింది. అనంతరం ఆచార్య మహేంద్రదేవ్ అధ్యక్షతన 'ఉపాధి కల్పన–సవాళ్లు' అంశంపై జరిగిన మరొక ప్లీనరీ సమావేశంలో న్యూఢిల్లీ మానవాభివృద్ధి సంస్థ సంచాలకులు అలక్ ఎన్.శర్మ, సీనియర్ అధ్యాపకులు బల్వంత్‌సింగ్ మెహతలు ప్రసంగించారు. ఉపాధి సూచికలో తెలంగాణ రాష్ట్రం మూడో స్థానంలో ఉందని వారు స్పష్టం చేశారు.

## కార్యకర్తలు అవిశ్రాంతంగా పనిచేయాలి



సనత్‌నగర్: కాంగ్రెస్ శ్రేణులన్నీ సమష్టిగా పనిచేసి పార్టీని గెలిపించుకుంటామని సీనియర్ నేత డాక్టర్ రవీందర్‌గౌడ్ స్పష్టం చేశారు. శుక్రవారం సనత్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి కోట నీలిమా అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ ఆమె గెలుపు కోసం కృషి చేస్తానని ప్రకటించారు. బల్కంపేటలో శుక్రవారం జరిగిన సమావేశంలో అభ్యర్థి నీలిమాతో కలిసి ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని గెలిపించుకునేంత వరకు కార్యకర్తలు అవిశ్రాంతంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. సీనియర్ నేతలు పాల్గొన్నారు.

## 'చలో పరేడ్ గ్రౌండ్'ను విజయవంతం చేయండి

అడ్డగుట్ట: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధనకు నవంబర్ 11న నిర్వహించనున్న 'చలో పరేడ్‌గ్రౌండ్ మాదిగల విశ్వరూప మహాసభ' ను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ డప్పు మల్లికార్జున్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం అడ్డగుట్టలోని లోహియ నగర్‌లో కరపత్రాన్ని ఆవిష్కరించారు. మల్లికార్జున్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధనకు ఏళ్ల తరబడి శ్రమిస్తున్న మాదిగలు, ఈ అంతిమ పోరాటానికి కూడా సంసిద్ధంగా ఉండాలన్నారు. నరేందర్ బాబు, నరసయ్య, సూరి పాల్గొన్నారు.


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

## ఆశా స్కూళ్ల అభివృద్ధికి ఎంఓయూ



సాక్షి, సిటీబ్యూరో: సికింద్రాబాద్‌తో పాటు న్యూఢిల్లీ, పూణే, బెంగళూరు, లక్నో, ఉధంపూర్‌లలోని ఆశా స్కూల్‌ల ఆధునీకరణ, సమగ్ర అభివృద్ధి కోసం రెలిగేర్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఆర్ఈఎల్), ఆర్మీ వైవ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఏడబ్ల్యూడబ్ల్యూఏ) సంస్థలు అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. సంయుక్త ఆధ్వర్యంలో ఈ వేదికల్లోని ప్రత్యేక సామర్థ్యమున్న పిల్లల సంక్షేమానికి తమ దీర్ఘకాల నిబద్ధతను శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించాయి. ప్రత్యేక సామర్థ్యమున్న పిల్లలకు ప్రోత్సాహమందించడానికి ఏడబ్ల్యూడబ్ల్యూఏ దేశవ్యాప్తంగా 32 ఆశా స్కూల్‌లను నిర్వహిస్తుంది.

## బీఆర్ఎస్‌లో పలువురి చేరిక చేరిక

సనత్‌నగర్: రాంగోపాల్‌పేట, బన్సీలాల్‌పేట డివిజన్లకు చెందిన పలువురు శుక్రవారం మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. అన్ని వర్గాల ప్రజల అభిమానాన్ని చూరగొ న్న బీఆర్ఎస్ పార్టీ హ్యాట్రిక్ ఖాయమన్నారు. నాయకులు జ్ఞాని, సంజీవ్, జగదీష్, కార్తీక్, వినోద్, సునీల్, రామ్ తదితరులు పాల్గొన్నారు.